ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
ఆదివారం 14 ఏప్రిల్ 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 24.0

# పీజీ ఫీజులేవీ ?

## విద్యార్థులకు జగనన్న ఝలక్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగవేత
- జిల్లాలో రూ.250 కోట్ల ఎగనామం
- పది వేల మందిపై ఆర్థిక భారం
- నరసాపురంలో బాబుకు విద్యార్థుల గోడు



చంద్రబాబుకు నరసాపురంలో విద్యార్థుల వినతి (ఫైల్)

భీమవరం రూరల్, ఏప్రిల్ 13 : విద్యార్థులను ఎంత వరకైనా ఉచితంగా చదివిస్తాం అంటూ గడిచిన ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఊరూ వాడా కోడై కూశారు. ఇదే నా హామీ అంటూ తల్లిదండ్రులకు వాగ్దానాలు కురిపించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు ఝలక్ ఇచ్చారు. ఐదేళ్లుగా పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టారు. బడుగు, బలహీన, పేద వర్గాల పిల్లలకు ఉన్నత విద్యను కలగానే మిగిల్చారు. డిగ్రీ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎంఎస్‌సీ, ఎంబీఏ, ఎం.ఫార్మసీ, ఎం.కామ్, ఎంఏ వంటి కోర్సులు చదువుకుంటున్నారు. ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తయితే ఎంటెక్ కోర్సులకు వెళుతుంటారు. పీజీ కోర్సులు పూర్తయిన తర్వాత పీహెచ్‌డీ చదువుకుంటున్న విద్యార్థులు అనేకమంది ఉన్నారు. ఇవన్నీ ఇప్పుడు పేద విద్యార్థులకు కలగానే మిగిలిపోతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయడం లేదు. కేవలం అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు విద్యా దీవెన రూపంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. ఆ పై చదువులకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. జిల్లాలో ఏటా పది వేల మంది విద్యార్థులు పీజీ విద్యనభ్యసిస్తున్నారు. సొంతంగానే ఫీజులు చెల్లించుకుంటున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు వుంటే అండర్ గ్రాడ్యుయేట్‌తోనే చదువులు నిలిపేస్తున్నారు. ప్రభుత్వం పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్ అమలు చేస్తే ఏటా జిల్లాలో దాదాపు రూ.50 కోట్లు వెచ్చించాలి. ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని గడిచిన ఎన్నికల ముందు జగన్ లెక్కకు మిక్కిలి ప్రకటనలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మొండి చేయి చూపారు. ఇలా సుమారు రూ.250 కోట్లకు ఎగనామం పెట్టారు.

### భర్తీ కాని సీట్లు

గతంలో ప్రభుత్వాలు పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసేవి. దీంతో పేదలకు ఎంబీఏ, ఎంకాం, ఎం.ఫార్మసీ, ఎంటెక్ కోర్సులను చదువుకునేవారు. పీహెచ్‌డీ చేసేశారు. ఐదేళ్ల నుంచి పరిస్థితులు తారుమారయ్యాయి. జిల్లాలో పీజీ సీట్లు భర్తీ కాని దుస్థితి నెలకొంది. సగం సీట్లు మిగిలిపోతున్నాయి. ఇంజనీరింగ్ కళాశాలల్లో పరిస్థితి మరింత దుర్భ రంగా ఉంది. ఎం.టెక్, ఎం.ఫార్మసీ సీట్లు ఆశిం చినస్థాయిలో భర్తీ కావడం లేదు. ఫీజు రీయిం బర్స్‌మెంట్‌పై ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు పీజీ కోర్సులకు దూరమయ్యారు.

### నరసాపురంలో బాబు హామీ

ఎప్పటిలాగే పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. విద్యార్థులు ఉన్నత చదువులకు ఎలాంటి ఇబ్బంది ఉండదంటూ చంద్రబాబు ప్రకటించారు. నరసాపురంలో నిర్వహించిన ప్రజాగళం రోడ్ షోలో విద్యార్థులు పలు సమస్యలపై ప్లకార్డులు ప్రదర్శించారు. అందులో పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒకటి. విద్యార్థుల వినతులకు అనుగుణంగా పీజీ చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామంటూ ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామంటూ భరోసా కల్పించింది.



### బకాయిలు చెల్లించని ప్రభుత్వం

మరోవైపు గతంలో బకాయిలను ప్రభుత్వం ఎగ్గొట్టి కళాశాలల యాజమాన్యాలను మోసం చేసింది. జిల్లాలో దాదాపు రూ.25 కోట్ల పీజీ బకాయిలున్నాయి. అందులో 70 శాతం ఇస్తామంటూ ప్రభుత్వం వాగ్దానం చేసింది. కళాశాలలు అంగీకరించేలా ఒత్తిడి తెచ్చింది. తీరా యాజమాన్యాలు అంగీకరించాక ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఇప్పటికీ బకాయిలు చెల్లించలేదు. ఎన్నికల వచ్చేశాయి. ఇక ఇస్తుందన్న ఆశా లేదు.

## ప్లస్ టూ ఫెయిల్ !

- బోధనలో ప్రాధాన్యత లేదు.. సౌకర్యాలు అంతంతే..
- విద్యార్థినుల వెనుకబాటుకు వైసీపీ ప్రభుత్వమే కారణం
- ఫస్టియర్ 30 శాతం, సెకండియర్ 38 శాతం ఉత్తీర్ణత
- విద్యార్థినుల తల్లిదండ్రుల్లో నిరుత్సాహం

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 : ప్లస్ టూ పాఠశాలల్లో ప్రభుత్వం ఫెయిల్ అయ్యింది. ఫస్టియర్ ఉత్తీర్ణతలో వెనుకబాటులే అనుకున్నా రెండో ఏడాది నిర్వహణ ప్రణాళిక లేకపోవడం కాస్తా విద్యార్థినులకు శాపంగా మారింది. దీంతో గత ఏడాది ప్లస్ టూ బ్యాచ్‌తోపాటు ఈ ఏడాది బ్యాచ్ విద్యార్థినులు ఉత్తీర్ణతకు వైసీపీ ప్రభుత్వం కారణంగా నిలిచింది. 2022-23లో జిల్లాలో 16 ప్లస్ టూ పాఠశాలలను నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం ప్రత్యేకంగా బోధన సిబ్బంది నియమించలేదు. జడ్పీ హైస్కూల్ సిబ్బందినే ఉపయోగించడంతో విద్యార్థినుల ఉత్తీర్ణత గత ఏడాది ఫలితాలలో 16 శాతానికి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సప్లిమెంటరీ ఫలితాలు అయిన తర్వాత 20 శాతం ఉత్తీర్ణతగా నిలిచారు. 2023-24లో అధ్యాపకులను ఏర్పాటు చేసినా, పుస్తకాలు, విద్యా సామగ్రి వంటివి ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు అందలేదు.

### ప్రణాళిక లేకపోతే ఫలితమిదే

ప్లస్ టూ పాఠశాలల ఏర్పాటుపై వున్న శ్రద్ధ.. విద్యా బోధనలో చూపించకపోవడం, ప్రణాళిక లేకపోవడం విద్యార్థినుల భవిష్యత్ చదువులో వెనుకబడేలా చేసింది. ప్రభుత్వ పాఠశాల నుంచి ఏటా జిల్లా నుంచి ఆరు వేలకు పైగా విద్యార్థులు ఉత్తీర్ణతగా రావడం వారిలో విద్యార్థినులు మూడు వేలకుపైగా ఉన్నప్పటికి ప్లస్ టూ పాఠశాలల అమలు తీరు చూసి 2022-23లో 120 మంది విద్యార్థినులు, 2023-24లో 206 మంది విద్యార్థినులు చేరారు. ఈ ఏడాది వైసీపీ నాయకులు ప్లస్ టూలో చేరాలని ప్రచారం చేశారు. చేర్పించారు. చివరికి ఉత్తీర్ణతకు వచ్చేసరికి మొదటి ఏడాది విద్యార్థినులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ మూడు గ్రూపులు గాను 206 మంది విద్యార్థినులు 61 మంది ఉత్తీర్ణత సాధించి 145 మంది ఫెయిల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 120 మంది విద్యార్థినులకు 45 మంది ఉత్తీర్ణులైతే 75 మంది ఫెయిల్ అయ్యారు. ప్రథమ సంవత్సరంలో 30 శాతం ద్వితీయ సంవత్సరం 38 శాతం ఉత్తీర్ణతతో సరిపెట్టేశారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు నిరుత్సాహంగా ఉన్నారు.

## మందుకు డిమాండ్

- అమ్మకాలు పెరిగితే దర్యాప్తునకు ఆదేశాలు
- ఉక్కిరి బిక్కిరి అవుతున్న సిబ్బంది

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు మద్యం అమ్మకాలు పెరగలేదని అధికారులు బాధపడ్డారు. రాష్ట్రస్థాయి సమీక్షలో సమాధానం చెప్పుకోలేక ఆపసోపాలు పడ్డారు. లక్ష్యాన్ని పెంచడానికి చేయని ప్రయత్నం లేదు. అయినా జిల్లా సగటు అమ్మకాలు ప్రభుత్వానికి సంతృప్తిని ఇవ్వలేదు. ఇప్పుడు అమ్మకాలు పెరుగుతున్నాయి. ఒకవైపు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇస్తున్న తాయిళాలు, మరోవైపు జాతరలు, పంట చేతికొస్తుండడంతో అమ్మకాల్లో కాసింత పెరుగుదల కనిపిస్తోంది. మరోవైపు జిల్లా నలుమూలలా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో తనిఖీల కారణంగా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న మద్యం అక్రమ రవాణా తగ్గిందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల కొన్ని షాపుల్లో అమ్మకాలు పెరుగుతున్నాయి. జిల్లా సగటు అదే విధంగా ఉంటోంది. దీనికి అసలు కారణం లేకపోలేదు. అమ్ముడు పోతోందని అధికంగా విక్రయిస్తే ఎన్నికల సంఘం కన్నేస్తోంది. దర్యాప్తు చేయాలని ఆదేశిస్తోంది. ఏమైనా తేడాలుంటే కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరిస్తోంది. దీంతో సిబ్బంది ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో డిగ్రీ చదివిన విద్యావంతులనే సిబ్బందిగా నియమించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏదైనా కేసు నమోదు అయితే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులకు ఇబ్బంది ఉంటుందని హడలిపోతున్నారు. అంతేకాదు తమ భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో లక్ష్యం మించిపోతుందంటే అమ్మకాలను తగ్గిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఆందోళన పడుతున్న కొంత మంది సిబ్బంది ఉద్యోగాన్ని వదులుకోవడానికి సిద్ధపడుతున్నారు. వారి రాజీనామా పత్రాలను అధికారులు స్వీకరించడం లేదు. మొత్తంపైన ఎన్నికల అధికారులు గట్టి నిఘా పెట్టడంతో అమ్మకాలు పెరుగుదుంటే సిబ్బందిలో గుబులు మొదలైంది. ప్రతిరోజు జిల్లాలో 40 వేల లీటర్ల వరకు మద్యం అమ్ముడు పోతోంది. మద్యం ద్వారా రూ.2.12 కోట్ల ఆదాయం వస్తోంది. గత ఏడాది ఇదే మాదిరి ఉండేది. ఎన్నికల సంఘం మాత్రం గత ఏడాది కంటే 30 శాతానికి మించి అమ్మకాలు జరిగిన షాపుల్లో తనిఖీలు చేయాలని ఆదేశించడంతో సిబ్బంది ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

## నరసాపురం ఎంపీ టిక్కెట్ రఘురామకేనా!

- ఇవ్వాలంటూ కూటమి ప్రతిపాదన
- బీజేపీ నాయకత్వానికి నివేదిక
- సానుకూల స్పందన రాకుంటే ఉండి ఎమ్మెల్యేగా పోటీ ఖాయం



భీమవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు సీటు కేటాయింపుపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఆయనకు సిట్టింగ్ స్థానమే కేటాయించాలంటూ కూటమి నాయకత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలో బీజేపీకి కేటాయించిన కొన్నిసీట్ల మార్పుపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సహా కేంద్ర నాయకులు చర్చించారు. వీటిలో నరసాపురం ఎంపీ, అనపర్తి ఎమ్మెల్యే స్థానాలున్నాయి. కేంద్ర నాయకత్వం నిర్ణయంపైనే ఎంపీ స్థానం మార్పు అవకాశం ఉంటుంది. ఇప్పటికే బీజేపీ నుంచి నరసాపురం ఎంపీ స్థానాన్ని భూపతిరాజు శ్రీనివాస్‌వర్మకు కేటాయించారు. అయితే రాజకీయ సమీకరణల నేపథ్యంలో రఘురామకు ఎంపీ సీటు కేటాయించేలా కూటమి బీజేపీ కేంద్ర నాయకత్వానికి ప్రతిపాదన పంపింది. అక్కడి నుంచి సానుకూల స్పందన వస్తే రఘురామ కూటమి తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారు. లేదంటే ఉండి ఎమ్మెల్యే స్థానాన్ని కేటాయిస్తారు. ఆ దిశగానే టీడీపీ నేతలకు చంద్రబాబు సంకేతాలు ఇచ్చారు.

## ఆక్వాపై విద్యుత్ భారం

- రాయితీ వర్తించకపోవడంతో రైతులు నష్టాల పాలు.. అమలు కాని సీఎం హామీలు
- ఉమ్మడి పశ్చిమలో 2.50 లక్షల ఎకరాల్లో సాగు

కలిదిండి, ఏప్రిల్ 13 : ఆక్వా సాగుకు విద్యుత్ రాయితీ వర్తించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టాల పాలవుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 2.50 లక్షల ఎకరాల్లో చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారు. 90 శాతం మంది రైతులు విద్యుత్ మోటార్ పంపు సెట్ల ద్వారా ఆక్వా సాగు చేస్తున్నారు. విద్యుత్ రాయితీ వర్తించకపోవడంతో చేపలు, రొయ్యలు పట్టుబడి వచ్చేసరికి ఎకరానికి సుమారు రూ.60 వేలు నుంచి రూ.80 వేలు ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదెకరాలలోపు వున్న చేపలు, రొయ్యల చెరువుల రైతులకు విద్యుత్ రాయితీ ఇస్తున్నామని సీఎం జగన్ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆచరించడం లేదని వాపోతున్నారు. కలిదిండి మండలంలో 36 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, 34 వేల ఎకరాల్లో చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారు. కేవలం రెండు వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేస్తున్నారు. కలిదిండి మండలం ఆక్వా జోన్‌లో ఉన్నప్పటికీ 10 ఎకరాలలోపు వున్న చెరువులు నాన్ ఆక్వా జోన్‌లో ఉన్నట్టుగా ఆన్‌లైన్‌లో చూపడంతో అధిక రేట్లతో విద్యుత్ బిల్లులు వస్తుండటంతో రైతులు విసుగెత్తిపోతున్నారు. యూనిట్‌కు రూ.1.50 పైసలు విద్యుత్ రాయితీ సన్న, చిన్నకారు రైతులకు వర్తించడం లేదని యూనిట్‌కు రూ.5.30 పైసలు వసూళ్లు చేస్తున్నారని ఆక్వా రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత ప్రభుత్వంలో ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ వర్తించింది.



చెరువులో రొయ్యలకు పట్టుబడి చేస్తున్న రైతులు

### పెరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు

రొయ్యల, చేపల చెరువులకు వినియోగించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు అధికంగా పెరిగాయి. టీడీపీ హయాంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ రూ.45 వేలు ఉండగా ప్రస్తుతం రూ.లక్షా 70 వేలకు చేరింది. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ రూ.85 వేల నుంచి రూ.3 లక్షలకు, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ రూ.లక్షా 25 వేల నుంచి రూ.4 లక్షలకు పెరిగింది. ఆక్వా రైతులు వినియోగించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు మూడు రెట్లు పెరగడంతో సన్న, చిన్న కారు రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేయలేక డీజిల్ ఇంజన్లతో సరిపెట్టుకున్నారు. డీజిల్ రేట్లు పెరగడంతో అధిక వ్యయమవుతుందని వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రేట్లు తగ్గించాలని కోరుతున్నారు.

### రొయ్యల సాగులో ఏరియేటర్లు కీలకం

రొయ్యల సాగులో ఏరియేటర్లు కీలకం. చెరువుల్లో ఏరియేటర్లు తిరిగితేనే ఆక్సిజన్ ఉత్పన్నమవుతుంది. అవి నిరంతరం తిరగాలంటే ట్రాన్స్‌ఫార్మర్లు తప్పనిసరి కావడంతో వీటిని అధిక డిమాండ్ ఏర్పడింది. పెరిగిన డీజిల్ ధరలను తట్టుకోలేక విద్యుత్ మోటార్లపైనే ఆధారపడి ఆక్వా సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ రాయితీ వర్తించకపోవడంతో అదనపు భారం పడడంతో నష్టాల పాలవుతున్నారు.

### విద్యుత్ రాయితీ ఇవ్వాలి

పోకల శ్రీనివాస్, ఎం.బుల్లివెంకయ్య, రైతులు

ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ అనే తేడా లేకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ ఇవ్వాలి. పదెకరాలలోపు వారికి ఆన్‌లైన్‌లో ఆక్వా జోన్‌గా చూపించడంతో ప్రభుత్వం అందించే విద్యుత్ రాయితీ యూనిట్‌కు 1.50 పైసలు వర్తించడం లేదు. యూనిట్‌కు రూ.5.30 పైసలు చెల్లించాల్సి వస్తోంది. విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో నష్టాల పాలవుతున్నాం. గత ప్రభుత్వంలో ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ గుర్తించడంతో ఆక్వా సాగు లాభసాటిగా ఉంది. ప్రస్తుతం అందుకు విరుద్ధంగా ఉంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రేట్లు మూడు రెట్లు పెరిగిపోవడంతో సన్న, చిన్న కారు రైతులు కొనుగోలు చేయలేక డీజిల్ ఇంజన్లతో ఆక్వా సాగు చేస్తుండడంతో అధిక వ్యయమవుతోంది. దీంతో పెట్టుబడులు రావడం లేదు. అప్పుల పాలవుతున్నాం. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు రేట్లు తగ్గించి గత ప్రభుత్వం ఇచ్చిన రేట్లకే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఇవ్వాలి.



## వలస ఓటర్లకు వైసీపీ ఎర

అత్తిలి, ఏప్రిల్ 13 : ఇంకా నామినేషన్ల పర్వం ఆరంభం కాలేదు. ఎన్నికలకు ఐదు వారాల సమయం ఉన్నా వైసీపీ నాయకులు వలస ఓటర్లపై కన్నేశారు. బతుకు తెరువు కోసం వెళ్లినవారే ఈ ఎన్నికల్లో తమ భవితవ్యాన్ని మారుస్తారని బరిలోకి దిగిన అభ్యర్థులు భావిస్తున్నారు. ముందుగా వారిని సంప్రదించి ప్రసన్నం చేసుకునేందుకు వారి బంధువులను ఆశ్రయిస్తున్నారు. ఏసీ రైలు టిక్కెట్లు సైతం తీసేందుకు వారి అంగీకారంతో ముందే నేతలు డబ్బులు పంపుతున్నారు. మే 13న పోలింగ్ రోజున స్వగ్రామాలకు రప్పించే బాధ్యత గృహ సారధులకు అప్పగించారు. రాను పోను టిక్కెట్లు, భోజన వసతి కల్పిస్తామని, దారి ఖర్చులు ఇస్తామని వారిని లోబర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. వలస వెళ్ళిన కుటుంబాల్లో ఎక్కువగా ఎక్కడెక్కడ ఉన్నారు ? ఏం చేస్తున్నారనే పనిలో నిమగ్నమయ్యారు. వారి బంధువుల ద్వారా వారి ఫోన్ నెంబర్, పోలింగ్‌స్టేషన్ నెంబర్, ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌తో జాబితాలు రూపొందిస్తున్నారు. ముందుగా వారితో మాట్లాడి వారికి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపే పనిని ప్రత్యేకంగా అప్పగించారు. జిల్లాలో కొందరు అభ్యర్థులు ఈ పనులు చక్కపెట్టాల్సిన బాధ్యతలను గృహ సారధులకు, ఇటీవల రాజీనామా చేసిన వలంటీర్ల భుజాన వేశారు.

### నియోజకవర్గాల వారీగా ఈవీఎంల తరలింపు

భీమవరం టౌన్, ఏప్రిల్ 13: ఈవీఎంల తరలింపు ప్రక్రియను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. శనివారం ఉదయం ఈవీఎం గోడౌన్ వద్ద బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌లను 120, 120, 130 దామాషాగా విభజించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం బీయూలు 3,508, సీయూలు 3,508, వీవీ ప్యాట్లు 3,800 తరలించాల్సి ఉందన్నారు. వీటిని జీపీఎస్ అమర్చిన డీజీటీ క్లోజ్డ్ వాహనాలలో పోలీస్ ఎస్కార్టుతో నియోజకవర్గాల వారీగా వేర్వేరు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచేందుకు తరలిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం ఆదివారం సాయంత్రం నాటికి పూర్తవుతుందన్నారు.

## 9 అంశాలతో తణుకు మేనిఫెస్టో

- కూటమి అభ్యర్థి ఆరిమిల్లి

ఇరగవరం, ఏప్రిల్ 13 : 'తణుకులో జిల్లా ఆసుపత్రి ఆధునికీకరణ, యువతకు ఉపాధి, గ్రామ దర్శిని-క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారం, మహిళా సాధికారత, ఇంటి వద్దకే పెన్షన్, రేషన్, చిరు వ్యాపారులకు, కార్మికులకు అండ, రైతన్నకు తోడు, అరాచకాలకు అడ్డుకట్ట, తణుకు మాస్టర్ ప్లాన్ అమలు వంటి తొమ్మిది అంశాలపై మినీ మేనిఫెస్టోను రూపొందించినట్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రకటించారు. అధికారంలోకి రాగానే వీటి అమలుపై ప్రత్యేక దృష్టి పెడతానని హామీ ఇచ్చారు. శనివారం తణుకు పదో వార్డులో ఆయన ప్రచారం నిర్వహించారు. తాము అధికారంలోకి వచ్చాక పింఛన్లను నాలుగు వేలకు పెంచనున్నట్టు చంద్రబాబు ప్రకటించారని, ఇంటి వద్దకే పింఛన్, రేషన్ అందిస్తామని, రైతులకు అండగా ఉంటూ ఐకేపీల ద్వారా ధాన్యం కొనుగోలు చేపడతామని హామీ ఇచ్చారు. శాంతి భద్రతల్ని అదుపులోకి తీసుకువస్తామన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ పరిమి వెంకటేశ్వర్లు, కలగర వెంకటకృష్ణ, ఐమ్మి రాంబాబు, చిట్టూరి సాయిబాబ, నాయుడు లావణ్య తదితరులు పాల్గొన్నారు.



నా భరోసా మేనిఫెస్టోను ప్రదర్శిస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ, కూటమి నేతలు



మహిళలతో ప్రచారం చేస్తున్న రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి

### సూపర్ సిక్స్‌కు అపూర్వ ఆదరణ

చంద్రబాబు పాలన మళ్లీ రావాలని మహిళలు కోరుకుంటున్నట్టు ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. కూటమి తరపున ఆమె శనివారం తణుకులో ఇంటింటికి వెళ్లి వైసీపీ దుర్మార్గ పాలనపై అవగాహన కల్పించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు చంద్రబాబు ఇస్తున్న వరాలు అపూర్వమన్నారు. బసవ రామకృష్ణ, బావిశెట్టి వెంకటసుబ్బారావు, గూడవల్లి జయలక్ష్మి, ఆకుల వెంకటేష్, రేళ్ళ మోహన్, తాతపూడి మారుతీరావు, కొప్పల్ ఇంద్రాదేవి పాల్గొన్నారు.

# టీచర్ల డిప్యుటేషన్లు రద్దు

## 23న పాతస్థానాల్లో రిపోర్టు చేయాలని ఆదేశాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 : ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్)కింద డిప్యూటేషన్లపై ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ ఈ నెల 23న పాతస్థానాల్లో విధుల్లో చేరాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. రేషనలైజేషన్ నిబంధనల మేరకు ఉమ్మడి జిల్లాలో మిగులు (సర్‌ప్లస్)గా గుర్తించిన టీచర్లను కొరతవున్న పాఠ శాలలకు గతేడాది అక్టోబర్‌లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద తాత్కాలికంగా డిప్యూటేషన్లపై నియమించిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం ఉమ్మడి జిల్లాలో సుమారు 200 మందికిపైగా ఉపాధ్యాయులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం చివరి పనిదినం ఈనెల 23న వర్క్ అడ్జస్ట్‌మెంట్/డిప్యూటేషన్ టీచర్లందరినీ రిలీవ్ చేసి వారు జీతం డ్రా చేసే పాఠశాలల్లో రిపోర్టు చేయాలని ఆదేశించడంతో ఆ మేరకు చర్యలు తీసుకోనున్నారు. డైట్ కేంద్రాలు, సమగ్రశిక్షలో డిప్యూటేషన్లపై పనిచేస్తున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్ టీచర్లకు, హెచ్‌ఎంలకు మాత్రం మినహాయింపు ఇచ్చినందున తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కొనసాగుతారు. ఈ ఉత్తర్వులకు అనుబంధంగా విద్యాశాఖ ఆదేశాలు జారీచేయాల్సి ఉంది.

## ఎన్నికల విధుల నుంచి మినహాయింపునకు అభ్యర్థన

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 : సాధారణ ఎన్నికల విధుల నుంచి దీర్ఘకాలిక రోగులకు, గర్భిణులకు, బాలింతలకు, దివ్యాంగులకు, 58 సంవత్సరాల వయసు పైబడిన ఉద్యోగులకు మినహాయింపు నివ్వాలని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు వినతిపత్రం పంపించామన్నారు.

## ఓపీవోలకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు పొడిగించాలి

పోలింగ్‌బూత్‌లలో క్లర్క్ విధులు నిర్వర్తించే ఓపీవోలకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు పీ.వీ.నరసింహారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ గడువు ఆదివారంతో ముగియనుండగా, జిల్లాలో ఇంతవరకు మెజార్టీ మండలాల్లో ఓపీవో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు నియామకపత్రాలు జారీ కానందున జిల్లా అధికారులు గడువు తేదీని పొడిగించాలని కోరారు.

## ఏలూరు తివాచీ ఉత్పత్తులకు ప్రోత్సాహం

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 13: స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం, మార్కెటింగ్ కల్పించేందుకు ఇన్వెస్ట్ ఇండియా పథకంలో భాగంగా 2023 ఏడాదిలో ఒక జిల్లా ఉత్పత్తి కార్యక్రమం కింద ఏలూరు జిల్లా నుంచి ఏలూరు తివాచీ ఉత్పత్తులు గుర్తించబడ్డాయని, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఎస్.రఘునంద తెలిపారు. ఈ ఏడాది ఏలూరు జిల్లా నుంచి తివాచీ ఉత్పత్తులను ఒకజిల్లా -ఒక ఉత్పత్తి కింద అవార్డు ఎంపికకు సిఫార్సు చేశామన్నారు. దీనిలో గుర్తింపు పొందితే ఈ ఉత్పత్తులకు రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించి గిరాకీ పెరగటమే కాకుండా ఉపాధి పెరగటానికి అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో సహజ రంగు తివాచీలకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందన్నారు. తివాచీలు నలుపు, తెలుపు, బ్రౌన్, సెమీబ్లాక్, గ్రే వంటి రంగుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఏలూరులోని తివాచీలు తరుచుగా వాటిని సృష్టించే కార్పెట్ తయారీదారుల పేరుమీద ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఏలూరులోని లక్ష్మివారపుపేట, తంగెళ్ళమూడిలో 40 కుటుంబాలు సహజసిద్ధ రంగులతో తివాచీలను తయారుచేసి సొంతంగా లేపాక్షి సంస్థ ద్వారా అంతర్జాతీయ ప్రదర్శనలో అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు.



జంక్షన్ స్టేషన్ సూపరింటెండెంట్ వానపల్లి చక్రవర్తికి వినతిపత్రం అందజేస్తున్న చెరుకువాడ రంగసాయి, తదితరులు

## నర్సాపురం, భీమవరం మీదుగా వందేభారత్ నడపాలి

భీమవరం క్రైం, ఏప్రిల్ 13 : వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపురం, భీమవరం మీదుగా నడపాలని, బెంగుళూరు ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపురం నుంచి ప్రతిరోజూ నడపాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైల్వే అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. భీమవరం జంక్షన్ స్టేషన్‌లో శ్రీవిజ్ఞాన వేదిక, రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైల్వే వారోత్సవాలలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వినతిపత్రం అందించారు. కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, జ్ఞానపాటి మధుసూధన్‌రావు, ఎండీ సరోజినిలు మాట్లాడుతూ డివిజన్‌లో అన్ని రైల్వేస్టేషన్‌లను అభివృద్ధి చేశారని, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌ను భీమవరం జంక్షన్ స్టేషన్‌లో ఆపాలని కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రైల్వే వారోత్సవాలలో భాగంగా మూడు పాఠశాలలో విద్యార్థులకు రైల్వే అంశాలపై పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులు అందిస్తామన్నారు. ఎస్‌కె చాన్ భాషా, జంక్షన్ ఎస్ఐ రమణ, కానిస్టేబుల్ రాజబాబు, ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు ట్రిపుల్ ఐటీలో టెక్‌జెట్-24



నూజివీడు టౌన్, ఏప్రిల్ 13: ఆర్జీయూకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న టెక్‌జెట్-24 జాతీయస్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ తొలిరోజు విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పోటీపడ్డారు. మొత్తం 15 ప్రొటోటైప్ ఎగ్జిబిట్‌లను విద్యార్థులు ప్రదర్శించారు. వీటితో పాటు ఇతర కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనగా, రాడార సిస్టమ్, వాయిస్ కంట్రోల్ బాట్, స్మార్ట్ హెల్మెట్ వంటి ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాలరాజు, సెంట్రల్ డీన్ డి.శ్రావణి, ఫైనాన్స్ ఆఫీసర్ బి.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

13-04-2024 పొగాకు ధరలు (రూ.)



| పొగాకు కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం | సరాసరి |
|---|---|---|---|
| దేవరపల్లి | 243 | 225 | 235.60 |
| జంగారెడ్డిగూడెం-1 | 244 | 235 | 240.40 |
| జంగారెడ్డిగూడెం-2 | 243 | 235 | 239.99 |
| కొయ్యలగూడెం | 244 | 235 | 240.56 |
| గోపాలపురం | 245 | 235 | 239.88 |



# జైశ్రీరాం..జైశ్రీరాం

## గోటి తలంబ్రాలతో భద్రాదికి రామభక్తుల పాదయాత్ర



జంగారెడ్డిగూడెం నుంచి భద్రాచలం పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 13 : శ్రీరామ నామ స్మరణతో జంగారెడ్డిగూడెం పట్టణం మోరు మోగింది. జైశ్రీరాం.. జైశ్రీరాం అంటూ భక్తులు ఒకరి వెంట ఒకరు పాదయాత్రగా కదిలారు. కిలోమీటర్ల మేర ఆ మహాపాదయాత్రను చూసేందుకు పాదయాత్ర సాగే సమీప గ్రామాల ప్రజలంతా రోడ్లపైకి వచ్చారు. పాదయాత్ర చేసే భక్తులకు అల్పాహారం, మజ్జిగ, మంచినీరు అందిస్తూ మార్గమధ్యలో ఆహ్వానం పలికి సేవ చేసుకున్నారు. జంగారెడ్డిగూడెం శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలతో జంగారెడ్డిగూడెం నుంచి భద్రాద్రికి 23వ పాదయాత్ర శనివారం ఉదయం ప్రారంభమైంది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో శ్రీరామ నవమి రోజున సీతారాముల కల్యాణం వేడుకలకు గోటితో ఒలిచిన తలంబ్రాలు అందించేందుకు మహా పాదయాత్రగా బయలుదేరారు. ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ సారథ్యంలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. పాదయాత్రను ప్రముఖ వ్యాపార వేత్త చామర్తి శ్రీరాములు ప్రారంభించగా శ్రీరామరథానికి సినీ గేయ రచయిత, తపన ఫౌండేషన్ ప్రతినిధి అనంత శ్రీరామ్ పూజలు నిర్వహించారు. సామాజిక వేత్త కెఎల్ఎన్ ధనకుమార్ గోటితలంబ్రాల ప్రాశస్త్యం వివరించారు. శ్రీవల్లీ దేవసేన సహిత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ కమిటీ అల్పాహారం, చోడుజావ పంపిణీ చేశారు.

# రాములోరి పెళ్లికి అపర భద్రాద్రి ముస్తాబు

## రేపటి నుంచి చనుబండ కోదండ రామస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు





సీతారాముల ఉత్సవ మూర్తులు

కల్యాణోత్సవాలకు ముస్తాబైన చనుబండ శ్రీకోదండ రామస్వామి ఆలయం

చాట్రాయి, ఏప్రిల్ 13: అపర భద్రాద్రిగా పేరుగాంచిన చనుబండ కోదండరామస్వామి ఆలయంలో 15వ తేదీ సోమవారం నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. చుట్టుపక్కల గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. 15న రాత్రి విష్వక్సేన పూజ, దీక్షా స్వీకరణ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ట, ధ్వజపట ప్రతిష్ట, 16న ఎదుర్కోలు ఉత్సవం (వధూవర అన్వేషణ) 17న స్వామివారి కల్యాణం అనంతరం గరుడోత్సవం, 18న మహా పట్టాభిషేకం, అన్న సమారాధన జరుగుతుంది. ఇదేరోజు రాత్రి 11.35 గంటలకు రథోత్సవం, 19న వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ, దీపోత్సవం, 20న ద్వాదశ ప్రదక్షణలు, రాత్రి 9.45 గంటలకు స్వామివారి పవళింపు సేవ జరుగుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి వివరించారు.

### 310 ఏళ్ల క్రితం నిర్మితమైన ఆలయం

ప్రస్తుతం ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చనుబండలోని కోదండ రామస్వామి ఆలయం ఉమ్మడి కృష్ణా జిల్లాలో పురాతనమైనది. 310 ఏళ్ళుగా భక్తుల ఆరాధ్య దైవంగా విలసిల్లుతూ అపర భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరాముడి దర్శనం గొప్ప భాగ్యంగా ప్రజలు భావిస్తుంటారు. చారిత్రక ఆధారాలను బట్టి ఈ ఆలయాన్ని నరశింహారావుపాలెం గ్రామానికి చెందిన పుచ్చకాయల రామిరెడ్డి అనే రామభక్తుడు 1713లో నిర్మించారు. పత్తి వ్యాపారం చేసే రామిరెడ్డి ఏడాది పొడవునా నియమనిష్ఠలతో గోటితో ధాన్యం వలిచి తలంబ్రాలు తయారు చేసుకొని శ్రీరామనవమికి భద్రాచలం కాలినడకన వెళ్లి రాములోరి కల్యాణంలో వినియోగించి వచ్చేవారు. వృద్ధాప్యం పైన పడటంతో ఇక నుంచి ఎలా భద్రాచలం రాగలను అని స్వామీ అని ధ్యానిస్తూ ఉండేవాడు. ఒక రోజు రామిరెడ్డి వ్యాపార నిమిత్తం తెలంగాణ ప్రాంతం మధిరకు వెళుతుండగా కనుమూరు గ్రామం దగ్గర పర్వతం వద్దకు వెళ్లేసరికి పొద్దుపోయింది. గాలి,వాన ప్రారంభమైంది. దారి కనిపించ కపోవడంతో తన సహచరులతో రామిరెడ్డి అక్కడే మకాం చేశారు. శ్రీరాముని ధ్యానించుచూ రామిరెడ్డి నిద్రించగా స్వామి స్వప్నంలో ప్రత్యక్షమై నీవు ఇక నుంచి భద్రాచలం రానవసరం లేదని,ఈ పర్వత ప్రాంతంలో పూజా విధానాలు లేకుండా ఉన్నానని తనను తీసుకువెళ్లి ప్రతిష్ఠించి కల్యాణం జరిపించమని ఆజ్ఞాపించెను. రామిరెడ్డి ఉదయాన్నే పరిజనులతో దక్షణాభిముఖుడై పరిసరాలను పరిశీలించగా ఒక రాతిపైనా తీగలచే చుట్టుకొనబడి ఉన్న బలుసు పొదలో శ్రీసీతారామలక్ష్మణుల విగ్రహాలు కన్పించాయి. రామిరెడ్డి వాటిని ఎద్దుల బండిపై తీసుకుని తన స్వగ్రామం నరశింహారావుపాలెం వస్తుండగా చనుబండ గ్రామం వచ్చాక ఎద్దులు కదలకుండా పడుకున్నాయి. ఎంత ప్రయత్నించినా ఎద్దులు లేవకపోవడంతో రామిరెడ్డి బృందం అక్కడే విశ్రమించారు. రామిరెడ్డి స్వామిని ప్రార్థిస్తూ నిద్రించగా స్వప్నంలో శ్రీరాముడు ప్రత్యక్షమై అక్కడే ఆలయం నిర్మించాలని ఆదేశించెను. అంతట రామిరెడ్డి తన శక్తినంతయు దారపోసినా ఆలయం పూర్తికాకపోవటంతో గ్రామాలకు వెళ్లి భక్తుల నుంచి విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణం పూర్తిచేసి విగ్రహాలు ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇది అపరభద్రాద్రిగా పేరుగాంచి పుణ్యక్షేత్రం అయ్యింది. ఆలయ నిర్మాణ సమయంలో ఇక్కడ గ్రామం లేదు. తరువాత చనుబండ గ్రామం ఏర్పడింది. ఇక్కడ జరిగే శ్రీసీతారామ కల్యాణానికి చుట్టుపక్కల మండలాలు, జిల్లాల నుంచే కాకుండా సరిహద్దున తెలంగాణ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. భద్రాచలం వెళ్లి సీతారాముల కల్యాణం తిలకిస్తే ఎంత ముక్తి లభిస్తుందో ఇక్కడ కల్యాణం చూసినా అంత ఫలం దక్కుతుందని భక్తుల విశ్వాసం.



శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

## శ్రీవారి క్షేత్రానికి భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 13: చిన్నతిరుమలేశుని సన్నిధి శనివారం భక్తజనులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. వేలాది మంది భక్తులు క్షేత్రానికి చేరుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 15 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా. శ్రీవారి ఉచిత దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది.

## పాటిమ్మతల్లి నిప్పులగుండం తొక్కిన భక్తులు



దెందులూరు, ఏప్రిల్ 13 : ఆపద మొక్కుల తల్లిగా, సంతాన లక్ష్మీగా పేరు పొందిన పెరుగు గూడెం యలమర్తి వారి ఆడపడుచు చల్లచింతల పూడి- పెరుగుగూడెం గ్రామాల మధ్య వెలసిన గ్రామదేవత పాటిమ్మ తల్లి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. శనివారం పాటిమ్మతల్లి అగ్ని గుండం తొక్కేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నిప్పుల గుండం ఆలయ ట్రస్టు చైర్మన్ యలమర్తి శ్రీనువాస్, హేమలత దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం నిప్పుల గుండ ప్రవేశం చేశారు. పుట్టింటి చీర,పసుపు, కుంకుమలను ఆలయ కమిటీ సభ్యులు యలమర్తి మోహన మురళీకృష్ణ, రామడు, బొర్రయ్య, పర్వతనేని ప్రభాకర్, మోహన్‌రావులు సమర్పించారు.

# వారపు సంతలు వెలవెల

## ఏజెన్సీలో అవే సూపర్ మార్కెట్‌లు

## వారం వారం గిరిజన గ్రామాలు కళకళ

## గిరిజనుల ఉత్పత్తులకు ఇదే మార్కెట్


## కరోనా తర్వాత అంతా కుదేలు

## శిథిలావస్థలో సంత షెడ్లు



సంతరోజున రోడ్డుపక్కనే వ్యాపారం చేసుకుంటున్న తినుబండారాల వ్యాపారి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 13 : సూపర్ మార్కెట్లను తలదన్నే విధంగా ఏజెన్సీ ప్రాంతంలో రాజ్యమేలిన ఒకప్పటి వారపు సంతలు నేడు ఆదరించేవారు లేక వెలవెలబోతున్నాయి. వారపు సంతలతో పశ్చిమ ఏజెన్సీలోని గిరిజన గ్రామాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండేవి. వ్యాపారులకు కాసుల వర్షం కురిపించేవి. సంతల్లో అన్ని రకాల వ్యాపారాలు చేసిన వారంతా బాగా స్థిరపడ్డారు. ఆస్తులు సంపాదించారు. అటువంటిది నేడు రోడ్డుపక్కన వ్యాపారాలు చేసుకోవలసిన దుస్థితి ఏర్పడింది. మూడు సంవత్సరాల క్రితం వరకు వారపు సంత వచ్చిందంటే ఆరోజంతా మన్యం బిడ్డలకు పండగే పండుగ. జాతరకు వచ్చినట్టుగా జనాలు సంతలకు తరలివచ్చి తమకు కావలసిన వాటిని కొనుక్కుని వెళ్ళేవారు. పెళ్ళికి కావలసిన వాటిని కూడా గిరిజనులు గతంలో సంతల్లో కొనుగోలు చేసేవారంటే వారపు సంతలకు ఎంతటి ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏజెన్సీలోని ప్రతి మండల కేంద్రంలో వారపు సంత జరిగేది. సంత నిర్వహణ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి పాకలు, షెడ్లు వేసి వేలం ద్వారా వ్యాపారులకు పంచాయతీ అధికారులు కేటాయించేవారు. సంవత్సరానికి సంతమార్కెట్ల ద్వారా పంచాయతీలకు వేలాది రూపాయలు ఆదాయం వచ్చేది. వచ్చిన డబ్బుతో అభివృద్ధి పనులు చేసేవారు. అనేక గ్రామాల్లో వారపు సంతలు వ్యాపారాలు, జనాలతో కళకళలాడుతూ ఉండేవి.



కూలడానికి సిద్ధంగా ఉన్న బుట్టాయగూడెంలోని సంత షెడ్లు

వైద్యసేవలు అందించడానికి గ్రామాలకు వెళ్ళిన వైద్య సిబ్బందికి కొండరెడ్డి గిరిజనులు అటవి సంపద సేకరణకు వెళ్లడం అందుబాటులో దొరికేవారు కాదు. అందుకే వైద్యాధికారులు కూడా సంతల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి వైద్యసేవలు అందించేవారు. ఏజెన్సీలో దశాబ్దాల పాటు రాజ్యమేలిన వారపు సంతలు నేడు కనిపించకుండా పోయాయి.

### రోడ్ల పక్కకు చేరిన దుకాణాలు

ఏజెన్సీలోని ఆదివాసీ కొండరెడ్డి గిరిజనులు అడవిలో సేకరించిన అటవీ సంపదను సంతల్లోనే అమ్ముకుని తమకు కావలసిన వాటిని కొనుగోలు చేసేవారు. వెదురుతో తయారు చేసిన వస్తువులు, విస్తరాకులు, చింతపండు, జిగురు, ఉసిరి తదితరవాటితో పాటు చివరకు వారు పండించిన పంటలను తెచ్చి సంతల్లోనే విక్రయించేవారు. వ్యాపారుల చేతుల్లో గిరిజనులు మోసాలకు గురవుతున్నారని గుర్తించిన ఐటీడీఏ, జీసీసీ అధికారులు పంటలను స్వయంగా కొనుగోలు చేసేవారు. ఆదివాసీలు మోసాలకు గురికాకుండా ప్రభుత్వ కాటాలను ఏర్పాటు చేసేవారు. సంతలకు గిరిజనులే కాకుండా వర్జీనీయా పొగాకు పనుల కోసం ఇతర జిల్లాల నుంచి వచ్చే బంటా కూలీలకు ఎంతగానో ఉపయోగపడేవి. ఉన్నత వర్గాలవారు కూడా సంతల్లో కొనుగోళ్ళు చేసేవారు. అంతటి పేరుగాంచిన వారపు సంతలు నేడు వెలవెలబోతున్నాయి. సంతల కోసం ప్రత్యేక స్థలాల్లో ఏర్పాటు చేసిన పాకలు, షెడ్లు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి కొన్నిచోట్ల కూలిపోతున్నాయి. కరోనా తర్వాత సంతలు క్రమంగా కనుమరుగవ్వడం ప్రారంభించాయి. పట్టణీకరణ పెరగడం, పట్టణాలకు వెళ్ళడం, గతంతో పోలిస్తే సంతల్లో అన్నిరకాల వస్తువులు ఇతర సామాగ్రి దొరక్కపోవడం, మోసాలు చోటు చేసుకోవడం గిరిజనుల్లో మార్పు తదితర వాటి కారణంగా సంతల్లో వందల సంఖ్యలో ఉండే షాపులు పదుల సంఖ్యలోకి పడిపోయాయి. చివరకు రోడ్డుపక్కన షాపులు పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నా కొనేనాధుడే లేకుండా పోయాడు.

### గతంలో వ్యాపారం బావుండేది



సంతలు సక్రమంగా జరిగే రోజుల్లో వ్యాపారం చక్కగా జరిగేది. జంగారెడ్డిగూడెం నుంచి వచ్చి వారపు సంతలో తిను బండరాల వ్యాపారం చేసేవాడిని. పెట్టుబడిపోను లాభాలు వచ్చేవి. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో వచ్చేవారు. నేడు రోడ్డుపక్కన షాపు పెట్టుకుని వ్యాపారం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. మా పెద్దల నుంచి ఇదే వ్యాపారం చేస్తున్నాం..అందుకే మానలేకపోతున్నాం..

-దాసరి శ్రీను, తినుబండారాల వ్యాపారి



కొత్తూరు చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

## కొత్తూరు చెక్‌పోస్టు వద్ద రూ.1.64 లక్షలు సీజ్

కామవరపుకోట ఏప్రిల్ 13.కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్టు వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ఒకరి నుంచి లక్షా 64 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు చెక్ పోస్టు ఇన్‌చార్జి కొయ్యగూర బాబూరావు శనివారం తెలిపారు. చింతలపూడి మండలం నామవరానికి చెందిన వ్యక్తి కారులో నగదుతో వెళుతుండగా తనిఖీ చేసి సీజ్ చేశామన్నారు.ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఫణీంద్ర, పోలీసులు కె.రమేష్, .రాంబాబు, కె.రామకృష్ణ, సూర్యారావు, రాము ఉన్నారు.

## 200 లీటర్ల సారా పట్టివేత



పోలవరం, ఏప్రిల్ 13 : పోలవరం మండలం కుంకాల అటవీ ప్రాంతంలో పోలీసులు శనివారం సారా బట్టీలపై దాడులు నిర్వహించి 200 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు పోలవరం మండలం జిల్లెల్లగూడెం పంచాయతీ కుంకాల అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించామని ఆ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి బట్టీ నిర్వాహకుడు మెంటి రాంబా బుని, అతని సహాయకుడు సంసాని మురళీకృష్ణని అరెస్టు చేసినట్లు తెలి పారు. రెండు మోటార్ సైకిళ్ళను సీజ్ చేశామని, పట్టుబడ్డ నిందితులను జంగా రెడ్డిగూడెం కోర్టులో ప్రవేశ పెట్టినట్లు తెలిపారు.

## పోలీసు నిఘా..విస్తృతంగా వాహనాల తనిఖీలు



ఏలూరు క్రైం, ఏప్రిల్ 13 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత జిల్లాలోని జాతీయ రహదారులు, రాష్ట్రీయ రహదారులు వివిధ కూడళ్ళల్లో వాహనాలను తనిఖీలు చేశారు. జిల్లాలోని రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహన డ్రైవర్లకు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మసీదులు, దేవాలయాలు, చర్చిలు, లాడ్జీలు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలలో కూడా ముమ్మరంగా తనిఖీలు చేశారు. జిల్లాలోకి అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా, నగదు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు.

## క్రైం కార్నర్

### పురుగుల మందు తాగి ఒకరి మృతి

ఉంగుటూరు,ఏప్రిల్ 13 : చేబ్రోలు పోలీసుస్టేషన్ పరిధిలోని వెల్లమిల్లి పంచాయతీ చింతాయిగూడెం గ్రామంలో పులపాక యేసుబాబు (58) ఈనెల 11న పురుగు మందు తాగాడు. అతడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మణి కుమార్ తెలిపారు.

### గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

పోలవరం, ఏప్రిల్ 13 : పోలవరం మండలంలో గూటాల పంచాయతీ కొండ్రుపీధి గోదావరి నది రేవులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమయ్యింది.పోలవరం పోలీస్ స్టేషన్‌కి అందిన సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని వివరాలు తెలియవలసి ఉందని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

### మార్కులు తక్కువ వచ్చాయని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

పాలకొల్లు రూరల్, ఏప్రిల్, 13 : మార్కులు తక్కువ వచ్చాయనే మనోవేదనతో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. యలమంచిలి మండలం కుమ్మరిపాలెంకు చెందిన నేదునూరి పావణి నాగరత్న కావ్య (17) పాలకొల్లులోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. శుక్రవారం విడుదలైన ఫలితాలలో మార్కులు తక్కువ రావడంతో మనోవేదన చెంది ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కుటుంబీకులు ఆమెను భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ మృతి చెందింది. యలమంచిలి ఎస్ఐ కె.శివన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆకివీడు, ఏప్రిల్ 13: ఆర్థిక ఇబ్బందులు తాళలేక విషం తీసుకున్న సందక శంకర్రావు (45) వైజాగ్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆకివీడు సంతమార్కెట్‌కు చెందిన శంకర్రావు ఈ నెల 2న విషం తీసుకోవడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం నిమిత్తం వైజాగ్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేర కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

### బాలిక వివాహం అడ్డుకున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఏలూరు రూరల్, ఏప్రిల్ 13: ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ బాలికకు పరీక్షా ఫలితాలు విడుదలైన రోజు బంధువులు ఆమెకు వివాహం నిశ్చయించారు. ఈ వివాహానికి భీమవరంలో ఒక కల్యాణమండపంలో భారీ ఏర్పాట్లు చేశారు. డిజిటల్ ఇన్విటేషన్‌లో భారీ లైటింగ్, సెట్టింగ్‌లతో పెండ్లికి ఏర్పాటు చేశారు. అయితే మైనార్టీ తీరని బాలికకు వివాహం జరుగుతుందన్న సమాచారం అందుకున్న ఏలూరు జిల్లా డీసీపీవో అధికారుల పర్యవేక్షణలో భీమడోలులోని అంగన్‌వాడీ, ఐసీడీఎస్ సిబ్బంది బాలిక ఇంటివద్దకు చేరుకుని వివాహం జరగకుండా అడ్డుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాలిక బంధువులు స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో బాలికను తీసుకుని తల్లిదండ్రులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఐసీడీఎస్ సిబ్బంది భీమడోలు పోలీసులకు సమాచారం అందించారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని అతిక్రమించి చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించడంతో ఆ బాలికను తిరిగి తీసుకువచ్చారు. ఏలూరులోని డీసీపీఈ అధికారుల ముందు బాలికను హాజరుపర్చగా ఆ బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించి తాత్కాలికంగా ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు.

## పోలేరమ్మ అమ్మవారికి వెండి చీర బహూకరణ



పోడూరు, ఏప్రిల్ 13: జిన్నూరు గ్రామ దేవత శ్రీపోలేరమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన దివంగత మాజీ సర్పంచ్ కొప్పర్తి సూర్య నారాయణ మనవడు సూర్య నారాయణ శ్రీదేవి దంపతులు రూ.5లక్షలతో తయారు చేయించిన వెండి చీర కవచాన్ని శనివారం ఆలయానికి అందించారు. కొప్పర్తి రాజేష్, లక్ష్మీప్రసన్న, దాత సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు టిడ్కో గృహాలు ఉచితంగా అందిస్తా: నిమ్మల



పాలకొల్లులో ప్రచారం చేస్తున్న నిమ్మల, అంగర

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 13: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే మహిళలు, పేదలకు టిడ్కో గృహాలు ఉచితంగా అందచేసే బాధ్యత తీసుకుంటానని టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు భరోసా ఇచ్చారు. పాలకొల్లు 15, 16వ వార్డులలో రామానాయుడు, మాజీఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌తో పాటు జనసేన, బీజేపీ నాయకులతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందిస్తామన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు రావూరి సుధ, జక్కంపూడి కుమార్, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు పాల్గొన్నారు.

## డాక్టర్ అంబేడ్కర్ స్ఫూర్తి

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 13: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితోనే ఎస్సీ సామాజికవర్గ ప్రజలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తున్నానని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు, క్లాత్ మర్చంట్స్ భవనంలో శనివారం రాత్రి టీడీపీ ఎస్సీసెల్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచారు.

## 6వ వార్డులో జనసేన ప్రచారం

నరసాపురం టౌన్, ఏప్రిల్ 13: పట్టణంలోని 6వ వార్డులో శనివారం జనసేన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభ్యర్థి బొమ్మిడి నాయకర్ కుమార్తె శ్రేయ ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు.

## మరోసారి అవకాశం ఇవ్వండి



ఖైప గ్రామంలో మాట్లాడుతున్న స్వతంత్ర అభ్యర్థి శివ

పాలకోడేరు, ఏప్రిల్ 13 : ఉండి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనపై ప్రజలు నమ్మకం ఉంచి మరో సారి అవకాశం కల్పిస్తే నియోజక వర్గ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. గరగపర్రు, ఖైప గ్రామాలలో స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు శనివారం ఆటోపై ముమ్మర ప్రచారం నిర్వహించారు. భూపతిరాజు శ్రీనివాస రాజు, భూపతిరాజు రామచంద్రరాజు, పి.నరసింహం, మన్నే మహంకాళీ, సత్యనారాయణ, ఏసు రాజు, వాసు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## కూటమి జెండా ఎగరాలి



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాబ్జి, బొలిశెట్టి శ్రీనివాస్, ఈతకోట తాతాజీ

పెంటపాడు, ఏప్రిల్ 13: టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి తాడేపల్లి గూడెంలో కూటమి జెండా ఎగురవేయాలని కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. శనివారం పట్టణంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో ఉమ్మడి పార్టీల వార్డు ప్రెసిడెంట్‌లు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## టైలర్స్‌కు అండగా ఉంటా: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 13: చేతి వృత్తుల వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని నియోజకవర్గ ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శనివారం పట్టణంలో టైలరింగ్ యూనియన్ సభ్యులు బొలిశెట్టిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

- పట్టణంలోని ఆరో వార్డు వైసీపీ ఇన్‌చార్జి మద్దుల నాగ వెంకట ప్రసాద్ శనివారం జనసేనలో చేరగా బొలిశెట్టి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు గొర్ల దుర్గారావు, వేగిరాజు రామచంద్రరాజు, ఆది కొండలరావు, నారిన ఏడుకొండలు, సోమశేఖర్‌వర్మ పార్టీలో చేరారు.

## జగన్ మద్యం దోపిడీ: పాకా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ, టీడీపీ నాయకులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 13 : జగన్ పాలనలో మద్యపాన నిషేధం పేరుతో జగన్ లక్ష కోట్లు లూటీ చేశారని బీజేపీ క్రమశిక్షణసంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కల్తీ మద్యంతో వేల మంది మహిళల మంగళసూత్రాలను తెంచారని అన్నారు. జే బ్రాండ్ల ద్వారా దోచుకున్న లక్షల కోట్ల డబ్బును కంటైనర్ల ద్వారా ఎన్నికలకు వైసీపీ నాయకులు తరలించారని, మద్యపాన నిషేధం అని చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వమే మద్యం అమ్మే లా చర్యలు చేపట్టారన్నారు. 2020లో క్రిసిల్ చేసిన సర్వే ప్రకారం ఏపీలో దాదాపు 34.5 శాతం మంది మద్యం సేవిస్తున్నారని, 2021లో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేలో ఏపీలో దాదాపు 31.4 శాతం మద్యం సేవిస్తున్నారని అన్నారు. అనేక గ్రామాల్లో మంచినీళ్లు లేవు కానీ మద్యం మాత్రం ఉందని ఎద్దేవా చేశారు.

## ఆమరణ దీక్ష విరమణ



ఆమరణదీక్షలు చేస్తున్న వారితో మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మీ, ఎమ్మెల్యే రామరాజు

ఉండి, ఏప్రిల్ 13: ఎమ్మెల్యే మంతెన రామరాజుకు పార్టీ అధిష్ఠానం తగిన న్యాయం చేస్తుందని, నాయకులు, కార్యకర్తలు ఎటువంటి ఆందోళన చెందవద్దంటూ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. శనివారం ఉండి టీడీపీ కార్యాలయం వద్ద జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీనివాస్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చెన్నంశెట్టి హరినాయుడు చేస్తున్న ఆమరణ దీక్షలు నాలుగోవ రోజుకు చేరాయి. వీరిని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ, ఎమ్మెల్యే రామరాజు పరామర్శించారు. అనంతరం పార్టీ నాయకులు దీక్షా దారులను బలవంతంగా 108 అంబులెన్స్‌లోకి ఎక్కించారు. అక్కడనే జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. కాగా ఇప్పటికే ఆమరణ దీక్షలో అనారోగ్యం పాలైన తెలుగుయువత నాయకుడు కాలా గణేష్‌ను భీమవరంలోని ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈతడిని ఎమ్మెల్యే రామరాజు పరామర్శించారు.

## 14 మంది వలంటీర్ల రాజీనామా

ఆకివీడు, ఏప్రిల్ 13: చినకాపవరం సచివాలయానికి చెందిన 14 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారని ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ తెలిపారు. ఇప్పటి వరకు ఆకివీడు-2 సచివాలయం నుంచి 18, ఆకివీడు-3 సచివాలయం నుంచి 24, దుంపగడప సచివాలయం నుంచి 8 కలిపి మొత్తం మండలంలో 62 మంది వలంటీర్లు రాజీనామా చేశారన్నారు.

# అంగన్వాడీ లబ్ధిదారులకు అందని పౌష్టికాహారం

ఇరగవరం, ఏప్రిల్ 13 : ఇరగవరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ దయనీయంగా మారింది. సూపర్‌వైజర్ లేక లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తూ ఉంటారు. కొన్ని నెలలుగా ఇరగవరానికి సూపర్ వైజర్ లేకపోవడంతో కేంద్రాల నుంచి అందించే వాటిపై పర్యవేక్షణ కొరవడింది. లబ్ధిదారులకు అందుతున్నాయో లేదో తెలియని పరిస్థితి. గత ఏడాది డిసెంబరు నెల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె చేయడంతో లబ్ధిదారులకు సరుకులు పూర్తిగా అందలేదు. అధికారులు మాత్రం ఎక్కడా లోపాలు లేకుండా సరుకులు సరఫరా చేస్తున్నామంటూ చెబుతున్న మాటలు కాగితాలకే పరిమితమవు తున్నాయి. లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు అందడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూపర్‌వైజర్‌ను నియమించి సరుకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 13 : అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్టు జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి వైవీ జానకి రామ్ తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. గృహాలు, అపార్టుమెంట్లలో జరిగే అగ్నిప్రమాదాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను తమ సిబ్బందితో వెళ్లి అవగాహన కల్పిస్తామని తెలిపారు. అలాగే విద్యుత్ ప్రమాదాలు నివారణకు, ప్రమాదాలు జరిగితే కంగారు పడకుండా ఏవిధంగా వ్యవహరించాలి అన్న అంశాలను వివరించడంతో పాటు, రాష్ట్ర అగ్నిమాపక శాఖ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఇంకా పట్టణంలో సిబ్బంది, వాహనంతో ర్యాలీ చేయడం, కర్మాగారాలలోనూ, గోదాములు, తాత్కాలిక నిర్మాణాలు, పందిర్లు, తాటి ఆకుల ఇళ్ళు, గడ్డివాములు వద్ద, విద్యా సంస్థ ల్లోనూ తీసుకోవలసిన సేఫ్టీ మెజర్‌మెంట్స్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

## బీసీల పక్షపాతి ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 13 : బీసీల సంక్షేమం, అభివృద్ధికి అహర్నిశలు పనిచేసే నాయకుడు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు అని నియోజక వర్గ బీసీ సంఘాల నాయకులు అన్నారు. మండలంలోని దిగమర్రు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా బీసీ (టీడీపీ) అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు అధ్యక్షత వహించారు.

## 23 నుంచి మావూరమ్మ జాతర



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 13 : స్థానిక బంగారు వారి చెరువుగట్టున గల మావూరమ్మ అమ్మవారి జాతర ఈనెల 23వ తేదీ నుంచి 27 వరకు జరుపుతున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో గరగల నృత్యాలు, బుట్టబొమ్మలు, కోర గేదెలు, బ్యాండ్ మేళాలు, ఆసాదుల విన్యాసాలతో జాతర నిర్వహించనున్నామని లిపారు.

## కాలు విరిగిన ఆవుదూడకు వైద్యం



ఆకివీడు, ఏప్రిల్ 13: గుమ్ములూరు సెంటర్ రోడ్‌లో డీసీసీబీ బ్యాంకు వెనుకాల ఆవుదూడను గుర్తు తెలియన వాహనం ఢీకొనడంతో కాలు విరిగింది. కదల్లేని పరిస్థితుల్లో ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారంతో వైటర్నరీ వైద్యుడు జనార్దనరావు వచ్చి పరిశీలించి కాలుకు కర్రలు కట్టి యాంటీ బయోటిక్ మందులతో పాటు సెలైన్ ఎక్కించారు. యాజమానులు పాలు తీసుకొని ఆవులు, దూడలను రోడ్లపైకి వదిలేయడంతో ఇటువంటి ప్రమాదాలు తలెత్తుతున్నాయన్నారు.

## అన్నసమారాధన

నరసాపురం రూరల్, ఏప్రిల్ 13: వేములదీవి గ్రామంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఇటు తూర్పుతాళ్ళు గ్రామంలోని కొండాలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా ఆఖండ సమారాధన నిర్వహించారు. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రజల మేలు కోరేది కూటమి ప్రభుత్వమే



రావిపాడులో ప్రచారం చేస్తున్న నిమ్మల సూర్యకుమారి

పోడూరు, ఏప్రిల్ 13:ప్రజల మేలు కోరేది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. రావిపాడులో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి శనివారం ఆమె ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు పాల్గొన్నారు.

## సాయుధ బలగాల కవాతు



గణపవరం, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నిబంధనలు ఉల్లంగించరాదని హెచ్చరిస్తూ మండలంలో శనివారం పోలీసులు, సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. కొత్తపల్లి, వరదరాజపురం, జల్లికొమ్మర గ్రామా ల్లో నిర్భయంగా ఓటు వేయవచ్చునని ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. నిడమర్రు సీఐ ఎంవీ.సుభాష్, గణపవరం ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## 16న అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13: నూతన విద్యావిధానంలో నాలుగో తరగతి నుంచి అయిదో తరగతిలోకి చేరేందుకు విద్యార్థులు విధిగా స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష రాయాల్సి ఉంటుందని తాడేపల్లిగూడెం ఎంఈవో వి. హనుమ తెలిపారు. ఈ నెల 16న ఈ పరీక్ష వీటి నిర్వహణకు తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 16 పాఠశాలలు ఏర్పాటు చేశామని వివరించారు. తాడేపల్లిగూడెంలో 650 మంది, పెంటపాడు మండలంలో 400 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని వారికి ప్రశ్న పత్రాలను ఆయా పాఠశాలలకు శనివారం పంపినట్టు తెలిపారు.

## 15, 16 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13: పెదతాడేపల్లి సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 15, 16 తేదీల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణం, మండలం, పెంటపాడు మండలాలకు ఈ రెండు రోజులు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్తు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## బీజేపీవి మతతత్వ రాజకీయాలు

ఆకివీడు, ఏప్రిల్ 13: మతతత్వ రాజకీయాలను పెంచి పోషిస్తున్న బీజేపీతో పాటు సంబంధిత పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ కోరింది. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రైస్‌మిల్లు కార్మికులు తదితరులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్ష-కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు మాట్లాడుతూ గత పదేళ్ళ బీజేపీ కేంద్రంలో మతం పేరుతో ప్రజలను చీల్చి పబ్బం గడుపుకుంటుందన్నారు.సామాన్య ప్రజలపై మోయలేని భారాలు వేసి కార్పొరేట్ శక్తులకు మోది లబ్ధి చేకూరుస్తున్నారన్నారు.

## దళితులు ఐకమత్యంగా ఉండాలి

ఆచంట, ఏప్రిల్ 13: దళితులు ఐకమత్యంతో కలిసి ఉండాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ అన్నారు. శనివారం కొడమంచిలి శివారు తురకపాని మెరకలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామవేశం నిర్వహించారు. దళితులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి రాజేష్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కొడమంచిలి మాల మహానాడు అధ్యక్షుడుగా బి.చినబాబును నియమించారు.

## కమ్యూనిటీహాల్స్ పేరుతో ఇసుక అక్రమ అమ్మకాలు




సమావేశంలో మాట్లాడుతున్న ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ

పెనుమంట్ర, ఏప్రిల్ 13 : కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి ఇసుక, సిమెంటు, ఐరన్ ఇస్తున్నానని చెప్పి గోదావరిలో అక్రమ ఇసుకను అమ్ముకుంటున్నా రని ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ ఆరోపించారు. అవినీతి రారాజు రంగరాజు అన్ని మార్గాల ద్వారా అవినీతికి పాల్పడుతున్నాడని ఇటువంటి అరాచక పాలకుడు ఆచంటకు అవసరమా అని అన్నారు. శనివారం మార్టేరులో జయహో బీసీ సభకు ముఖ్యఅతిథిగా పితాని విచ్చేసి మాట్లాడారు. ఎమ్మెల్యేని ప్రజలు నిలదీసి ఇంటికి సాగ నంపాలని పిలుపునిచ్చారు. కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి ఎన్నికలవేళ నిధులు మంజూరు చేయడాన్ని ఆయన తప్పు పట్టారు రజకులకు ఎస్సీలుగా చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పెనుమంట్ర మండల బీసీ సెల్ అధ్యక్షుడు నరాలశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కర్నేని గౌరునాయుడు, రాష్ట్ర దేవాంగ సాధికార సమితి కన్వీ నర్ బీకర ప్రసాద్ పాల్గొన్నారు.

**ఆచంట:** కరుగోరుమిల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు సలాది మురళీకృష్ణ శనివారం పితాని నివాసం వద్ద టీడీపీలో చేరారు. ఈయనతోపాటు మరో 50 మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పితాని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## టీడీపీ హయాంలోనే బీసీల అభివృద్ధి

పోడూరు, ఏప్రిల్ 13: గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనే బీసీల సంక్షేమం, అభివృద్ధి జరిగిందని ఆచంట అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరులో శనివారం రాత్రి జరిగిన జయహో బీసీ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌లు పెట్టి నిధులు ఇవ్వకుండా బీసీలను మోసం చేసిందని విమర్శించారు. రాబోయే కూటమి ప్రభుత్వంలో బీసీలకు రక్షణ చట్టంతో పాటు 50ఏళ్లకే రూ.4వేల పెన్షన్ అందించనుందన్నారు. ఈసభకు మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు దొంగ గవరయ్య అధ్యక్షత వహించారు. సభలో పార్టీ పరిశీలకుడు రుద్రరాజు వెంకటరామరాజు, బీసీ నాయకులు బీవీకె. శివన్నారాయణ, దొంగ సూర్యప్రసాదు, బొక్కా నాగేశ్వరరావు, గుబ్బల అప్పన్నస్వామి పాల్గొన్నారు.

## ఈవీఎంలు వచ్చేశాయి...

ఆచంట, ఏప్రిల్ 13: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్ శనివారం ఆచంటకు రాగా వీటిని స్థానిక ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో పూర్తి బందోబస్తు మధ్య భద్రపరిచినట్టు నియోజకవర్గ ఎన్నికల అధికారి వి. స్వామి నాయుడు తెలిపారు. స్ట్రాంగ్ రూం వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## డాక్టర్ హిప్నో కమలాకర్ జయంతి

ఇరగవరం, ఏప్రిల్ 13 : ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హిప్నో కమలాకర్ జయంతిని తణుకు మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పాలంగిలోని స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో 40 మందికి పండ్లు పంపిణీ చేశారు. పీపీఏఐ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మ కమలాకర్, కన్వీనర్ డాక్టర్ పేరుబోయిన రమేష్‌కుమార్, డాక్టర్ వి. జనార్ధనం, డాక్టర్ ఎం. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## 28న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

ఇరగవరం, ఏప్రిల్ 13 : బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక ఈ నెల 28 తణుకు పట్టణంలోని బంధకవి సుభద్రమ్మ కల్యాణ మండపంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మరింత సమాచారం కోసం 94905 30135, 98660 19391 నంబరును సంప్రదించాలని కోరారు.

## ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి

ఇరగవరం, ఏప్రిల్ 13 : ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉన్నట్టు తమ మేనిఫెస్టోల్లో ప్రకటించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి బళ్ళ చినవీరభద్రరావు డిమాండ్ చేశారు. శనివారం అర్జునుడిపాలెంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాసు, వీర రాఘవరెడ్డి, వెంకట లక్ష్మి, మునలయ్య, కృష్ణకుమారి, సుబ్బలక్ష్మి, బాలయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



## రంగవల్లులతో అమ్మవారికి అలంకారం



భీమవరం టౌన్, ఏప్రిల్ 13 : మెంటే వారితోటలోని విజయ కనకదుర్గ శ్రీ చక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రులు సందర్భంగా ఐదో రోజు పురస్కరించుకుని వలవల సూర్యనారాయణ మహాలక్ష్మి దంపతులచే అమ్మవారికి ఆలయ అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారంనాడు అభిషేకాలు,కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం రంగవల్లులలతో అమ్మవారికి అలంకారం చేశారు. ఇందులో భాగంగా ముత్తయిదువులచే ఆలయ ప్రాంగణంలో రంగవల్లులుతో అలంకరించారు.

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఆచంట, ఏప్రిల్ 13: వల్లూరులోని శ్రీ రుక్మిణి సమేత మదన గోపాలస్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం శనివారం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, పితాని తనయుడు వెంకట్ పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో దొంగల భయం

పాలకోడేరు, ఏప్రిల్ 13 : పాలకోడేరు వాటర్ ప్లాంట్ సైడ్ ఉన్న జగనన్న కాలనీలో దొంగల బెడద ఎక్కువగా ఉంది. సొంతింటికల నెరవేర్చుకోవడానికి తంటాలు పడి అప్పులు చేసి ఇంటి నిర్మాణానికి తెచ్చుకున్న మెటీరియల్ మాయం చేస్తున్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్, వాటర్ మోటార్లు సైతం దొంగలిస్తున్నారు. ఒక పక్క దారి లేక, కరెంటు లేక, ఎటువంటి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు దొంగతనాలతో లబోదిబోమంటున్నారు. జగనన్న కాలనీ వాసులకు గాని, సచివాలయ సిబ్బందికి గాని ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు కాలనీలో సంచరిస్తూ ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు నిఘా పెట్టి తగు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



అడుగంటిన కాళ్ళకూరు ప్రధాన మంచినీటి చెరువు... నీరు లేక ఎండిపోయిన ప్రధాన పంట కాలువ

## కాళ్ళకూరులో తాగునీటికి కటకట

కాళ్ళ, ఏప్రిల్ 13 : కాళ్ళకూరు గ్రామంలో మంచినీటి చెరువు పూర్తిగా అడుగంటి తాగునీరుఅందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సుమారు 20 రోజుల నుంచి పంట కాలువలో పూర్తిస్థాయిలో నీరు లేకపోవడంతో గ్రామంలోని మంచినీటి చెరువులు పూర్తిగా అడుగంటాయన్నారు. వంతుల వారీ విధానంలో వస్తున్న కొద్దిపాటి నీరు ఎగువ ప్రాంతంలో చేపల చెరువుల రైతులు తోడుకోవడంతో తాగునీటి ఎద్దడి తీవ్రమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ ఇంజన్‌తో తోడుకుందామన్నా నీరందని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే నడి వేసవిలో పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఒక పక్కన మంచినీటి చెరువులో నీరు నింపుకోవాలని అధికారులు నోటీసులు ఇస్తున్నారని, కాలువలో నీరు రాకుండా ఎలా నింపుకోవాలని కార్యదర్శి ప్రశ్నించారు. ఇరిగేషన్ ఏఈ రాముకి నీరు రావడం లేదని ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న సంబంధిత ఏఈపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ సాధు శ్రీనివాస్, ఉపసర్పంచ్ నడింపల్లి ప్రదీప్‌రాజు, కార్యదర్శి డి.సునీల్ రాజు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.